


తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 181 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజీలు : 04, వెల రూ. 4రూ/ గురువారం- 28 - మే - 2026

Published From Kurnool : Circulated at `Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

## దేశంలోనే తొలిసారిగా - విజయవాడలో "సూపర్ ప్రెజర్ బెలూన్" ప్రయోగం విజయవంతం



సూపర్ ప్రెజర్ బెలూన్‌ను రూపొందించిన

రెడ్ బెలూన్ ఏరో స్పేస్ స్టార్టప్

వాతావరణ పరిశోధన, విపత్తు నిర్వహణ

సమాచారం తెలుసుకోవచ్చని సంస్థ వెల్లడి

ఢిల్లి : రెడ్ బెలూన్ ఏరోస్పేస్ అనే స్టార్టప్ సంస్థ రూపొందించిన 'సూపర్ ప్రెజర్ బెలూన్'ను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ మైదానంలో విజయవంతంగా ప్రయోగించారు. దేశంలోనే తొలిసారిగా దీన్ని గాల్లోకి ఎగురవేసి పరీక్షించారు. దీనిని పాలిమర్ నానోకాంపోజిట్‌తో తయారుచేసి హైడ్రోజన్‌తో నింపారు. నావిగేషన్ కోసం గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ మాడ్యూల్‌ను అమర్చారు. మిగతా..2లో

## బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు



మైనర్ బాలికను లైంగికంగా వేధించాడంటూ కేసు

చర్లపల్లి జైలు నుంచి భగీరథ్ ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

కూకట్‌పల్లి డీసీపీ పర్యవేక్షణలో జరుగుతున్న విచారణ

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఈరోజు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. ఈ కేసులో మరింత లోతుగా విచారణ జరిపి, మరిన్ని కీలక వివరాలు రాబట్టేందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు కోర్టును ఆశ్రయించగా... న్యాయస్థానం మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. మిగతా..2లో

### అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

## కేటీఆర్‌కు పొంగులేటి సవాల్



ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

హైదరాబాద్, మే27: ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను

### తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

# మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ

- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చించేందుకు సిద్ధమని సీఎం లేఖ
- తెలంగాణ ప్రతినిధులకు మహారాష్ట్ర సమయం ఇవ్వాలని కోరిన సీఎం



హైదరాబాద్: తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ కోరారు. తెలంగాణకు నీళ్లొస్తాయి : తుమ్మిడిహట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించాల్సిన అవసరం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని, ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్ లేఖలో పేర్కొన్నారు. మిగతా..2లో

### రాష్ట్రంలో మరో నాలుగైదు

## రోజుల పాటు వర్షాలు"



- రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి.
- రానున్న నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.
- గత నాలుగు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోందన్నారు.

హైదరాబాద్: తెలంగాణలో కొద్దిరోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా పగటిపూట ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఓ వైపు ఎండలు.. మరోవైపు వడగాల్పుల కారణంగా ప్రజలు బయటకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. మిగతా..2లో

### అసోంలో 'ఉమ్మడి పౌర స్మృతి ' బిల్లుకు ఆమోదం

## గిరిజనులకు మాత్రం మినహాయింపు



- అసోంలో యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) బిల్లుకు ఆమోదం
- ఇది ఓ రాజకీయ అజెండా అని కాంగ్రెస్ విమర్శ

ఢిల్లి : అసోం అసెంబ్లీ బుధవారం 'ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) బిల్లు'ను ఆమోదించింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలన కోసం పంపాలని విపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. మతంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి వ్యక్తిగత విషయాలపై అందరికీ ఒకే రకమైన చట్టాలను తీసుకురావాలనే లక్ష్యంతో

### ప్రధాని మోదీతో తమిళనాడు

# సీఎం విజయ్ భేటీ

## ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి

మోదీతో విజయ్ భేటీ- తమిళనాడుకు మౌలిక, సంక్షేమ పథకాలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి



ఢిల్లి: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ బుధవారం ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రధానిని కలవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా 'మేకెదాటు డ్యామ్ ' ప్రాజెక్టు, తమిళ మత్స్యకారుల అరెస్టుల గురించి విజయ్ మోదీతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా అనైమంగళం రాగి శాసనాలను తిరిగి భారత్ కు తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి, మిగతా..2లో

### సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో

# ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

- ఈ అంశంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అమలు చేయాలన్న అమిత్ షా
- సరిహద్దు జిల్లాల కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం



ఢిల్లి : దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలన్నారు. రాజస్థాన్‌లోని భారత్-పాక్ సరిహద్దు జిల్లాల్లో భద్రతా పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్'

అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మిగతా..2లో

### ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు




- హైబ్రిడ్ మోడల్ లో మహానాడు అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట అంటూ ఎద్దేవా
- దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ఎన్టీఆర్ అని కితాబు
- రాజకీయాల్లో ఎన్టీఆర్ ట్రెండ్ సెట్ చేశారని వ్యాఖ్య

అమరావతి : మహానాడు ప్రారంభం సందర్భంగా టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ప్రత్యర్థి పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. హైబ్రిడ్ విధానంలో

### మహిళలకు గౌరవం, ఆత్మస్థైర్యాన్ని

# ఇచ్చిన పార్టీ తెలుగుదేశం

- టీడీపీ మహానాడులో మహిళా సాధికారతపై మహిళా నేతల ప్రసంగం
- చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్ కల్పించడమనేది చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని వెల్లడి
- ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని పిలుపు




అమరావతి : మహిళలను గౌరవించడం, మహిళలకు అవకాశం కల్పించడం, మహిళలకు ఆత్మస్థైర్యం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని మహిళ నేతలు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో మహిళా సాధికారతపై మహిళ నేతలు మాట్లాడుతూ మహిళ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి, కుటుంబానికి ధైర్యం, సమాజానికి స్ఫూర్తి అని నమ్మింది మిగతా..2లో

### పసుపు సైన్యం గర్జన మహానాడు అన్న శబరి



- టీడీపీ కార్యకర్తల ఇంట్లో యోధులు పుడతారని వ్యాఖ్య
- వైసీపీ విధ్వంసకర పాలనతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్న శబరి

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కేవలం ఒక సామాన్య సభ కాదని, అది పసుపు సైన్యం గర్జన అని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి అభివర్ణించారు. మహానాడు వేదికగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, కార్యకర్తలపై ప్రశంసల జల్లు కురిపిస్తూ సభలో సరికొత్త ఉత్తేజాన్ని నింపారు. ఈ సందర్భంగా బైరెడ్డి శబరి చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. "ప్రతి ఇంట్లో పిల్లలు పుడతారు.. కానీ తెలుగుదేశం కార్యకర్తల ఇంట్లో మాత్రం యోధులు పుడతారు" అంటూ ఆమె వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

## పసుపు సైన్యం గర్జన మహానాడు అన్న శబరి

తామంతా పార్టీ కోసం, తమ అధినేత చంద్రబాబు కోసం, పార్టీ ఆశయాల కోసమే అంకితభావంతో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మహానాడు రాబోయే రోజుల్లో రాష్ట్ర భవిష్యత్తును మార్చబోయే ఒక మహా సంకల్ప సభ అని బైరెడ్డి శబరి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సంక్షేమాన్ని చేరవేస్తూ, సువర్ణ పాలన అందించడమే తెలుగుదేశం పార్టీ ఏకైక లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు. అభివృద్ధి, సంక్షేమం టీడీపీ నినాదమైతే... హత్యలు, అవినీతి, దోపిడీ అనేది వైసీపీ నినాదమని ఎద్దేవా చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచకాలు జరిగాయంటూ ఆమె ఈ వేదికపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ విధ్వంసకర పాలన వల్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, బాధపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగానే గత ఐదేళ్లలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి, తీవ్రంగా హింసించారని ఎంపీ బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటి వేధింపులను తట్టుకుని నిలబడిన కార్యకర్తల అండతోనే ఈరోజు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆమె కొనియాడారు.

### అలా చేస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటారా?

## కేటీఆర్‌కు పొంగులేటి సవాల్

పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించానా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యానం తీసుకోనక్కర్లేదంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

## బండి భగీరథ్ ను జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

ఈ నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముందుగా నిందితుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం, భారీ భద్రత నడుమ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విచారణ ప్రక్రియ అంతా కూకట్‌పల్లి డీసీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతోంది. బాధితురాలి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు మరిన్ని సెక్షన్లను చేర్చిన నేపథ్యంలో, ఈ మూడు రోజుల కస్టడీ విచారణ అత్యంత కీలకంగా మారనుంది.

## ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి

ముఖ్యమంత్రి విజయ్ కృతజ్ఞతలు తెలియజేశారు. దీనితోపాటు తమిళనాడు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో సంప్రదాయకంగా రాష్ట్ర ప్రార్థన గీతం 'తమిళ తాయ్ వాళ్తు' పాడడం ఆనవాయితీగా వస్తోందని సీఎం విజయ్ ప్రధానికి వివరించారు. అయితే ఈ ఏడాది జనవరిలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఒక సర్క్యులర్ తర్వాత, ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గీతాన్ని ముందుగా పాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో ఎప్పటిలానే రాష్ట్ర ప్రార్థన గీతాన్ని పాడడానికి అనుమతిస్తూ తగిన వివరణ ఇవ్వాలని కేంద్ర హోంశాఖను ఆదేశించాలని విజయ్ ప్రధానిని కోరారు. తమిళనాడులో 'సెంటర్ ఫర్ ఎయిర్ బోర్న్ సిస్టమ్స్ ' (సీఏబీఎస్) ల్యాబ్ ను ఏర్పాటు చేయాలని కూడా విజయ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అడ్వాన్స్ డ్ మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ (ఏఎంసీఏ) డిజైన్ అండ్ డెవలప్ మెంట్ సెంటర్, అలాగే సీఏబీఎస్ ఏర్పాటు చేయడంపై గత కొన్ని సంవత్సరాలుగా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్ డీఓ)తో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

కర్ణాటక డ్యామ్ కు అనుమతి ఇవ్వొద్దు

కావేరీ నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన 'మేకెదాటు డ్యామ్ ' ప్రాజెక్టు గురించి కూడా ప్రధాని మోదీతో విజయ్ మాట్లాడారు. 'ఈ మేకెదాటు ప్రాజెక్టు కోసం భూమి పూజ చేస్తామని కర్ణాటక ఉపముఖ్యమంత్రి ప్రకటన చేశారు. కావేరీ నీటి వివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన తుది తీర్పునకు, సుప్రీంకోర్టు ఆదేశాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని విజయ్ పేర్కొన్నారు. కర్ణాటక తలపెట్టిన ప్రాజెక్టు వల్ల తమిళనాడు రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఆయన చెప్పారు. కావేరీ నదీ పరీవాహక ప్రాంతాలుగా ఉన్న తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అనుమతి లేకుండా ఈ మేకెదాటు ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖను, సెంట్రల్ వాటర్ కమిషన్ ను ఆదేశించాలని మోదీని విజయ్ కోరారు.

సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. ఈ సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల జనాభాకు మద్దతుగా నిలవడానికి, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.

360–డిగ్రీల భద్రతా కవచానికి ఏర్పాటు

ప్రతి సరిహద్దు జిల్లాకు పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360–డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని అమిత్ షా చెప్పారు. ముఖ్యంగా అంతర్గత సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, అటువంటి నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్‌ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్ షా ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి '1930' కాల్ సెంటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అంశాలపై రెండు నెలల తర్వాత తిరిగి సమీక్ష, అభిప్రాయ సేకరణ చేపడుతారని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలు ఫలిత ఆధారిత చర్యలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాటి ప్రభావం పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని ఒక ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ నేతృత్వంలో జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌ఎల్‌సిడిసి) ఏర్పాటు చేసింది. దిల్లీ కేంద్రంగా పనిచేసే ఈ కమిటీలో సెన్సస్ కమిషనర్‌తో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిలోగా తన నివేదికను సమర్పిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాయింట్ సెక్రటరీ (విదేశీయులు–1) ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని అమిత్ షా చెప్పారు.

## ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి'

సీబీఎస్ఈ రాూవీ వివాదంపై రాహుల్ గాంధీ ఫైర్

ఇటీవలే రిలీజైన సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు

కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు– ఈ విధానం కారణంగా తమ ఆన్సర్ షీట్లు తారుమారయ్యాయన్న కొందరు స్టూడెంట్స్

: సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు భారీ అవకతవకలతో నిండిపోయాయని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీసేందుకు స్వతంత్రంగా న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు వివాదాల్లో చిక్కుకున్న కోఎంప్ట్‌కు సీబీఎస్ఈ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చారని కేంద్ర సర్కార్‌ను ప్రశ్నించారు. కోఎంప్ట్ యాజమాన్యానికీ, ప్రధాని మోదీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. కాగా, సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు. దీంతో తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మూల్యాంకన వ్యవస్థలో జరిగిన అవకతవకల కారణంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వివాదం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఉద్దేశపూర్వక కుట్రను సూచిస్తోందని అన్నారు. మూల్యాంకన వ్యవస్థకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. "సీబీఎస్ఈ ఫలితాల స్కామ్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

## మహిళలకు గౌరవం, ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిన పార్టీ తెలుగుదేశం

మొదటి పేజీ తరువాయి

మన తెలుగుదేశం పార్టీనేనని గుర్తు చేశారు. మహిళ బలపడితే కుటుంబం బలపడుతుంది: భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహిళా సాధికారతకు 'నారీ శక్తి వందన్ అధినియం' (చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్) ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మహిళ నేతలు అభిప్రాయపడ్డారు. ఇది కేవలం సంఖ్యాపరమైన మార్పు కోసం తెచ్చింది కాదు, దేశ విధానాల్లో మహిళల స్వరం బలంగా వినిపించేందుకు రాజకీయ నిర్ణయాల్లో వారికి సమాన భాగస్వామ్యం కల్పించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణ అని గుర్తు చేశారు. మహిళా సాధికారిత మాటల్లో కాదు, చేతల్లో చేసి చూపిన పార్టీ తెలుగుదేశం అని స్పష్టం చేశారు. మహిళ బలపడితే కుటుంబం బలపడుతుందని, తద్వారా సమాజం బలపడుతుందని బలంగా నమ్మే పార్టీ తెలుగుదేశం అని వివరించారు. అణిచివేసే ప్రయత్నం చేస్తే తెలుగుదేశం పార్టీలో యోధులు పుట్టుకొస్తారని గొడ్డలి పార్టీకి అర్థమై ఉంటుందన్నారు. ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ తిప్పికొట్టాలని మహానాడులో మహిళా నేతలందరూ పిలుపునిచ్చారు. 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు: 'స్త్రీశక్తి' థీమ్‌తో ఈ మహానాడు కార్యక్రమం మహిళల ఆత్మగౌరవం, సాధికారత, భద్రత కోసం తెలుగుదేశం పార్టీ తీసుకుంటున్న సంకల్పానికి ప్రతీకగా నిలవనుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ మహానాడు కార్యకర్తల ఉత్సాహంతో, తెలుగుదేశం కుటుంబం శక్తితో విజయవంతం కానుంది. మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా సమాజానికి శక్తిగా గుర్తించిన ఏకైక పార్టీ తెలుగు దేశమని టీడీపీ మహిళా నేతలందరూ అభిప్రాయపడ్డారు. మహిళల ఉన్నత విద్య కోసం అన్న ఎన్టీఆర్ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి, ఆడబిడ్డలకు చదువు ఒక అవకాశం మాత్రమే కాదు, హక్కు అని చాటి చెప్పారని వెల్లడించారు. 1986లో ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి, అమ్మాయి అంటే భారం కాదు కుటుంబ వారసత్వం అని నిరూపించారని హర్షం వ్యక్తం చేశారు. స్త్రీ అంటే కేవలం కుటుంబ బాధ్యతలు మోసే వ్యక్తి కాదు. కుటుంబానికి ధైర్యం, సమాజాన్ని ముందుకు నడిపించే శక్తి. మహిళా సాధికారతకు నిజమైన అర్థం చెప్పిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసి మహిళల ఉన్నత విద్యకు బాటలు వేసిన ఘనత ఎన్టీఆర్‌దని మహిళా నేతలందరూ చాటిచెప్పారు. మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన: తెలుగుదేశం పార్టీలో ఇకపై మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాసైనా, కాకపోయినా పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. బిగ్ అనౌన్స్‌మెంట్ అని ఉదయం పెట్టిన పోస్టుకు అనుగుణంగా తన ప్రసంగంలో మహిళలకు రిజర్వేషన్ అంశాన్ని నారా లోకేశ్ ప్రకటించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్సీపీ పోకడలను ఎత్తి చూపారు. యువనేతకు ధన్యవాదాలు: కార్యకర్తే అధినేత అనే తీర్మానాన్ని మంత్రి సవిత మహానాడులో ప్రవేశపెట్టారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగం అన్నారు. టెక్నాలజీని ఉపయోగించి మన పార్టీలో నాయకత్వాన్ని మరింత పటిష్టంగా నిర్మించిన ఘనత మన యువ నాయకులు నారా లోకేశ్ దని వెల్లడించారు. మహిళా సాధికారత కోసం మహిళలను అన్ని విధాలా లోకేశ్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ను 2029 ఎన్నికల్లో ఇవ్వనున్నట్లు ప్రకటించిన యువనేతకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు చెప్పారు. కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశం పార్టీ నినాదమని వ్యాఖ్యానించారు. కార్యకర్తలకు ప్రమాద బీమా, కష్టాల్లో ఉన్న కార్యకర్తల పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న ఘనత మన తెలుగుదేశం పార్టీ సొంతమన్నారు. గొడ్డలిపార్టీ అధినేత తన పార్టీ కార్యకర్తలను సంఘ విద్రోహశక్తులుగా తయారు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

## ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ II కి బ్యాటింగ్ తప్పదు

మొదటి పేజీ తరువాయి

మహానాడు జరుగుతున్నప్పటికీ టీమ్ –11 కి బ్యాటింగ్ తప్పదని వార్నింగ్ ఇచ్చారు. "ఆఫ్‌లైన్ అయినా, ఆన్‌లైన్ అయినా, హైబ్రిడ్ అయినా మహానాడు మాస్ జాతర సూపర్ హిట్. పసుపు పండుగ మహానాడు. ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి నేను తెలుగు వాడిని, నాది తెలుగుదేశం పార్టీ అని చెప్పుకునే వేదిక మహానాడు. నేషన్ ఫస్ట్ అనేది తెలుగుదేశం పార్టీ విధానం. మన దేశం – మన బాధ్యత. ప్రధాని మోదీ సూచించిన మార్గాన్ని మనం ఫాలో అవుతున్నాం. నెల్లూరులో భారీగా మహానాడు నిర్వహించాలనుకున్నాం. ప్రత్యేక పరిస్థితుల్లో హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తున్నాం. మనం హైబ్రిడ్ మోడల్ అనగానే టీమ్ 11 సంబరాలు చేసుకున్నారంట. ఆఫ్‌లైన్ అయినా, హైబ్రిడ్ మోడల్ అయినా టీమ్ 11 కి బ్యాటింగ్ తప్పదు" అని స్పష్టం చేశారు.



**లెజెండ్... అన్న ఎన్టీఆర్!**

విశ్వవిఖ్యాత నట సార్వభౌమ శ్రీ నందమూరి తారక రామారావు గారు దేశానికి లెజెండ్. తెలుగువారి ఆత్మ గౌరవం, తెలుగు వారి పౌరుషం ఎన్టీఆర్. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయన ట్రెండ్ ఫాలో అవ్వలేదు.. ట్రెండ్ సెట్ చేశారు. ఆయన రికార్డులు బద్దలు కొట్టడం ఎవరివల్లా సాధ్యం కాదు. దేశానికి సంక్షేమం, అభివృద్ధి పరిచయం చేసింది ఎన్టీఆర్. 2 రూపాయలకు కిలో బియ్యం, పెన్షన్, జనతా వస్త్రాలు, పక్కా ఇళ్లు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, పటేల్‌పట్వారీ విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు వంటివి ప్రవేశపెట్టింది ఎన్టీఆర్. స్త్రీశక్తిని మొదట గుర్తించింది, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది, మహిళల కోసం ప్రత్యేకంగా పద్మావతి యూనివర్సిటీ పెట్టింది, మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చింది అన్న ఎన్టీఆర్... అని లోకేశ్ ప్రశంసించారు.

## దేశంలోనే తొలిసారిగా - విజయవాడలో "సూపర్ ప్రెజర్ బెలూన్" ప్రయోగం విజయవంతం

మొదటి పేజీ తరువాయి

50 కిలోల వరకు పేలోడ్‌ను మోయగల సామర్థ్యం ఉన్న ఈ బెలూన్‌లో ఇతర సెన్సార్లతో పాటు ఆరు పేలోడ్‌లు ఉన్నాయి. ఏమిటీ సూపర్ ప్రెజర్ బెలూన్ : సూపర్ ప్రెజర్ బెలూన్ అనేది అధిక ఎత్తులో (స్ట్రాటోస్పియర్) టెలికమ్యూనికేషన్లు, శాస్త్రీయ పరిశోధనల కోసం ఉపయోగించే ఒక ప్రత్యేకమైన బెలూన్. బయటి వాతావరణంతో సంబంధం లేకుండా లోపల ఉండే హైడ్రోజన్ ద్వారా ఇవి చాలా రోజుల పాటు గాల్లో తేలుతూ ఉంటాయి. గ్రామీణ ప్రాంతాలకు కమ్యూనికేషన్ , ఇంటర్ నెట్ సేవలను అందించడానికి, అంతరిక్ష పరిశోధనలకు ఇవి ఎంతోగానో ఉపయోగపడతాయి. వందల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న పారిశ్రామిక కారిడార్ల పర్యవేక్షణకు కూడా వీటిని వినియోగిస్తారు.

**విజయవాడలో "సూపర్ ప్రెజర్ బెలూన్" ప్రయోగం విజయవంతం**

రెడ్ బెలూన్ ఏరోస్పేస్ స్టార్టప్ సంస్థ రూపొందించిన సూపర్ ప్రెజర్ బెలూన్ ఒక చారిత్రాత్మక ఘట్టమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు. దీనిని తయారు చేసిన స్టార్టప్ వ్యవస్థాపకులు అభినందనలు తెలియజేశారు. ఏపీకి ఇదో మైలురాయి అని ప్రశంసించారు. టవర్లు లేని గ్రామాలు, గిరిజన, తీర ప్రాంతాల్లోనూ ఈ సాంకేతికత కనెక్టివిటీని విస్తరించగలదని చెప్పారు. ఈ బెలూన్ సుమారు భూమి నుంచి 25 కిలోమీటర్ల పైకి వెళ్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ, శ్రీహరికోటలో స్పేస్‌సిటీ ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలను తెచ్చిందన్నారు. దానిని యువత సద్వినియోగం చేసుకొని స్పేస్ టెక్నాలజీలో రాణించాలని కోరుకుంటున్నట్లు ఆకాక్షించారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రోత్సాహంతో భారత స్పేస్ పరిశ్రమ ద్వారా ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. రాబోయే పదేళ్లలో ఇది 40 బిలియన్ డాలర్ల (సుమారు 4 లక్షల కోట్ల)కు చేరుకొనే అవకాశం ఉందన్నారు. రెడ్ బెలూన్ ఏరోస్పేస్ స్టార్టప్ సంస్థ ద్వారా ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని రామ్మోహన్ నాయుడు చెప్పారు. "రెడ్ బెలూన్ ఏరోస్పేస్ స్టార్టప్ సంస్థ రూపొందించిన సూపర్ ప్రెజర్ బెలూన్ ఒక చారిత్రాత్మక ఘట్టం. ఏపీకి ఇదో మైలురాయి. టవర్లు లేని గ్రామాలు, గిరిజన, తీర ప్రాంతాల్లోనూ ఈ సాంకేతికత కనెక్టివిటీని విస్తరించగలదు. ఈ బెలూన్ సుమారు భూమి నుంచి 25 కిలోమీటర్ల పైకి వెళ్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ, శ్రీహరికోటలో స్పేస్ సిటీ ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలను తెచ్చింది. దానిని యువత సద్వినియోగం చేసుకొని స్పేస్ టెక్నాలజీలో



రాణించాలి." – రామ్మోహన్ నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ఈ సూపర్ ప్రెజర్ బెలూన్ ల ద్వారా ఉపగ్రహాల కంటే చాలా తక్కువ ఖర్చుతో వాతావరణ పరిశోధన, భూమి పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ సమాచారాన్ని సేకరించవచ్చని రెడ్ బెలూన్ ఏరోస్పేస్ సంస్థ సహ వ్యవస్థాపకులు కిరణ్ తెలిపారు. తద్వారా గ్రామీణ ప్రాంతాలకు చౌకగా టెలికమ్యూనికేషన్స్, ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తుందన్నారు. ఏపీ ప్రభుత్వం తమకు అన్ని సహాయ కార్యక్రమాలు అందించిందని చెప్పారు. ఈ ప్రయోగం వల్ల ప్రపంచంలోనే దేశానికి మంచి స్థానం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయులు, రెడ్ బెలూన్ ఏరోస్పేస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు"

మొదటి పేజీ తరువాయి

అయితే గత రెండు రోజులుగా సాయంత్రం, రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నమోదవుతోంది. దాంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా వివరించింది. వీటిని వేసవికాలంలో కురిసే ప్రీ– మాన్ సూన్ సీజన్ లో కురిసే జల్లులంటారని పేర్కొంది. రానున్న నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. తెలంగాణలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవవచ్చని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. అలాగే పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ సైతం జారీ చేశారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇక ఇదే



విషయంపై వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస రావు మాట్లాడుతూ.. గత నాలుగు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోందన్నారు. అలాగే దక్షిణ, పశ్చిమ తెలంగాణలో చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో అకాల వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాల కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచనలు చేశారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక మంగళవారం రాత్రి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసిన విషయం తెలిసిందే. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు మండిపోయాయి. ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. అయితే సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపరిపీల్చుకున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, బాలానగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, దిల్ సుఖ్ నగర్, లక్డీకాపూల్, అమీర్ పేట్, కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో స్వల్పంగా వర్షపాతం నమోదైంది.

## అసోంలో 'ఉమ్మడి పౌర స్మృతి ' బిల్లుకు ఆమోదం- గిరిజనులకు మాత్రం మినహాయింపు

మొదటి పేజీ తరువాయి

అసోం ప్రభుత్వం సోమవారం ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా బహుభార్యత్వాన్ని నిషేధించాలని, సహజీవనం రిజిస్ట్రేషన్ ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ బిల్లు అసోంలో నివసించే ఏ షెడ్యూల్ తెగలకు (ఎస్ టీ)లకు వర్తించదు. యూసీసీ ప్రకారం, ఒకరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకుంటే ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. సహజీవనం చేసే జంటలు తమ బంధాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే 3 నెలల జైలు శిక్ష విధిస్తారు.

జవహర్ లాల్ నెహ్రూనే యూసీసీ కావాలన్నారు

ఈ బిల్లు ఆమోదం పొందడానికి కొద్ది సేపటి ముందు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. 1925లోనే పౌర ఉమ్మడి స్మృతిని మొదటిసారిగా సమర్థించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ (లౌకిక) పార్టీగా లేదని, కేవలం ఒక నిర్దిష్ట సమాజానికి ప్రతినిధిగా మారిపోయిందని ఆరోపించారు. ఇకపై అసెంబ్లీలో 'ది యూనిఫామ్ సివిల్ కోడ్, అసోం, 2026'పై అడిగిన ప్రశ్నలకు సీఎం హిమంత బిశ్వ శర్మ సమాధానం ఇస్తూ, "ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ఈ చట్టం బీజేపీ లేదా ఆర్ ఎస్ ఎస్ సిద్ధాంతాలపై ఆధారపడి లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ఆధారంగానే రూపొందించాం. వాస్తవానికి యూసీసీకి పెద్ద చరిత్రే ఉంది. దీనిని 1925లో మొదటిసారి కాంగ్రెస్ పార్టీయే డిమాండ్ చేసింది. 1937లో స్వయంగా జవహర్ లాల్ నెహ్రూ దీనిని ప్రవేశపెట్టాలని సూచించారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు యూసీసీని హిందూ, క్రైస్తవ, గిరిజనుల కోణం నుంచి కాకుండా ఖురాన్ , షరియా కోణం ద్వారా చూస్తూ వ్యతిరేకిస్తోంది" అని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ హిమంత కీలక వ్యాఖ్యలు చేశారు. "అసెంబ్లీలో కాంగ్రెస్ వారి ఎమ్మెల్యేల కూర్పు చేస్తేనే వారు అన్ని కులాలు, మతాలు, వర్గాలకు



ప్రాతినిధ్యం వహించడం లేదని, కేవలం ఒక నిర్దిష్ట సమాజానికే ప్రాతినిధ్యం వహిస్తున్నారని అర్థం అవుతోంది. కాంగ్రెస్ పార్టీ అసోంకు ప్రాతినిధ్యం వహించడం లేదు. 126 మంది సభ్యులున్న అసోం అసెంబ్లీలో కాంగ్రెస్ కు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో 18 మంది ముస్లిం సమాజానికి చెందినవారు కాగా, ఒక్కరు మాత్రమే హిందువు" అని విమర్శించారు.

అసోం ప్రజలకు అభినందనలు

యూసీసీ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎక్స్ వేదికగా, అసోం ప్రజలకు అభినందనలు తెలిపారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో, బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పౌరుడి కోసం ఒకే విధమైన చట్టాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఉత్తరాఖండ్ , గుజరాత్ తర్వాత అసోం కూడా ఈ రోజు ఉమ్మడి పౌర స్మృతి బిల్లును ఆమోదించడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.

ఇది బీజేపీ రాజకీయ ఎజెండా

అంతకుముందు, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు యూసీసీ బిల్లును తీవ్రంగా విమర్శించాయి. ఈ బిల్లులను బీజేపీ రాజకీయ ఎజెండా అని కొట్టిపారేశారు. ఈ బిల్లుపై ప్రజలతో పెద్ద ఎత్తున చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఈ ఉమ్మడి పౌర స్మృతి బిల్లు వల్ల మైనారిటీ మత వర్గాల హక్కులకు భంగం వాటిల్లుతుందేమోనని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. "యూసీసీలో పేర్కొన్న విషయాలన్నీ ఇప్పటికే వేర్వేరు చట్టాల రూపంలో అమలులో ఉన్నాయి. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, పెళ్లిళ్లు–విడాకుల రిజిస్ట్రేషన్ , భరణం వంటి విషయాలన్నీ మన ప్రస్తుత చట్టాల పరిధిలో ఉన్నాయి. మరి అలాంటప్పుడు మళ్లీ యూసీసీ తీసుకురావడంలో అర్థం ఏమిటి? బీజేపీ కేవలం రాజకీయాలు చేయడానికే ఈ బిల్లును తీసుకొచ్చింది. ఇలా పౌరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. గిరిజనులను మినహాయించినప్పుడు ఈ చట్టాన్ని యూనిఫామ్ (అందరికీ సమానమైనది) అని ఎలా పిలుస్తారు?" అని కాంగ్రెస్ ఎమ్మెల్యే వాజెద్ అలీ చౌదరి ప్రశ్నించారు. నిరుద్యోగం, వరదల సమస్య, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి వంటి ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి హిమంత ప్రభుత్వం ఈ యూసీసీ బిల్లును తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని వాజెద్ అలీ చౌదరి ఆరోపించారు. అయితే ప్రభుత్వం మాత్రం మతంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి వ్యక్తిగత విషయాలు అన్నింటికీ ఒకే రకమైన చట్టాలను అమలు చేయాలనేదే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే జాకీర్ హుస్సేన్ సిక్దర్ మాట్లాడుతూ, 2018 నాటి లా కమిషన్ కూడా ఈ బిల్లును పాస్ చేయడానికి అభ్యంతరం పెట్టిందని గుర్తు చేశారు. ఇక అసోం అసెంబ్లీలోని ఏకైక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యే షెర్మన్ అలీ అహ్మద్ ఈ బిల్లులోని నిబంధనలను వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్ డీఏ ప్రభుత్వం దురుద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు.

# చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి.

**31న బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఉద్యమకారుల సదస్సు:**

**కంది కట్ల జయ పిలుపు.**

**కేకే కేశవరావు కమిటీతో ప్రత్యేక సమావేశం.**

**10 ఉమ్మడి జిల్లాల మహిళా ఉద్యమకారిణులు తరలిరావాలని విజ్ఞప్తి.**



హైదరాబాద్ మే 27 (వార్త నిర్భయం) ఈనెల 31వ తేదీ ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళా కార్యదర్శి, ఉమ్మడి వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కంది కట్ల జయ పిలుపునిచ్చారు.కేకే కేశవరావు మరియు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీతో ప్రత్యేక సమావేశం జరుగుతుందని ఆమె తెలిపారు.మహిళా ఉద్యమకారిణుల పాత్ర కీలకం రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి మహిళా ఉద్యమ నాయకులు, నాయకురాళ్లు, ఉమ్మడి జిల్లా కమిటీలు, జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల బాధ్యులు, ముఖ్యంగా మహిళా ఉద్యమకారిణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆనాడు మహిళలందరూ భాగస్వామ్యం అయ్యారని, ఉద్యమకారులకు ఇచ్చిన హామీల సాధన కోసం జరుగుతున్న నిరంతర పోరాటాలలో కూడా మహిళల పాత్ర గణనీయంగా ఉందని జయ గుర్తు చేశారు.

# సీనియర్ రిపోర్టర్ శ్రీరాం రమేష్ కన్నుమూత.

**గుండెపోటుతో ఢిల్లీలో చికిత్స పొందుతూ మృతి.**

**గురువారం ఉదయం వరకు పార్థివ దేహం వర్ధన్నపేటకు.**

**పాత్రికేయ వర్గాల్లో విషాదం.**



వర్ధన్నపేట మే 27 (వార్త నిర్భయం) వర్ధన్నపేట సీనియర్ రిపోర్టర్ శ్రీరాం రమేష్ గుండెపోటుతో ఢిల్లీలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం, గురువారం ఉదయం వరకు ఆయన పార్థివ దేహాన్ని వర్ధన్నపేటకు తీసుకురానున్నారు. శ్రీరాం రమేష్ మృతి పట్ల పాత్రికేయ వర్గాలు, పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం వర్ధన్నపేట ప్రాంతంలో రిపోర్టర్‌గా పనిచేసిన రమేష్, ప్రజా సమస్యలపై అనేక కథనాలు రాశారు.

# వడదెబ్బ కారణంగా జడ్చర్ల మున్సిపాలిటీ మహిళా పారిశుద్ధ్య కార్మికురాలు యాదమ్మ మృతి



జడ్చర్ల మే 27 వార్త నిర్భయం

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న యస్ ,యాదమ్మ (52) జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లింది. తల నొప్పి గా ఉందని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కొసం వెళ్ళింది. అక్కడ వైద్యం చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది, దీంతో వడదెబ్బ కారణంగా మహిళా పారిశుద్ధ్య కార్మికురాలు యాదమ్మ మృతి చేయించినట్లు వైద్యులు తెలిపారు, బుధవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7 వ వార్డు లో యాదమ్మ మృతదేహాన్ని సందర్శించి మున్సిపల్ కమిషనర్ గిరీష్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు, అనంతరం పదివేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు,

# 'లిఫ్ట్ కుట్రలు జల దోపిడీలో భాగమే'

**జీవో 98ను తక్షణమే రద్దు చేయాలి.**

**కమీషన్ల కోసమే మున్నేరు-పాలేరు లింక్ కెనాల్'.**

**ప్రజా ఉద్యమాలను నీరుగార్చేందుకే లిఫ్ట్ లేఖలు**

**విశ్వ జంపాల**



హైదరాబాద్ మే 27 (వార్త నిర్భయం) గార్ల మండలాన్ని ఎడారిగా మార్చే మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌కు అనుకూలంగా చెబుతూ, మరోవైపు లిఫ్ట్ ఇరిగేషన్ కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ ఇవ్వడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది విశ్వ జంపాల ఆరోపించారు.బుధవారం గార్లలో మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ లింక్ కెనాల్‌ను వ్యతిరేకిస్తూ మండలంలో జరుగుతున్న ప్రజా ఉద్యమాలను నీరుగార్చే కుట్రలో భాగంగానే ఈ లేఖలు ముందుకొస్తున్నాయని అన్నారు.ఒకపక్క వందల ఎకరాల భూ సేకరణకు సర్వం సిద్ధం చేస్తూ, ఇంకోవైపు లిఫ్ట్ కడతాం అనడం పచ్చి మోసం. గార్ల మండల భూములను ఎడారిగా మార్చే ఏ ప్రాజెక్టునైనా ప్రాణాలు అడ్డుపెట్టయినా అడ్డుకుంటాం" అని హెచ్చరించారు.ఇప్పటికే మున్నేరుపై ఉన్న లిఫ్టులు 20 ఏళ్లుగా పనిచేయకుండా పడావు పడ్డాయని, చిన్న లిఫ్టులనే నిర్వహించలేని ప్రభుత్వం కొత్త లిఫ్ట్‌లు కడతామనడం గార్ల ప్రజలను ఏమార్చి నీళ్లను ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నమేనని విమర్శించారు. తమ వేదిక డిజిటల్ సర్వేలో 95% మంది ప్రజలు లింక్ కెనాల్‌ను వ్యతిరేకించారని, అయినా ఎమ్మెల్యే లేఖలో ప్రజలు అనుకూలమని పేర్కొనడం హాస్యాస్పదమని అన్నారు.ఎమ్మెల్యేకు గిరిజన రైతాంగంపై ప్రేమాభిమానాలు ఉంటే జీవో 98ను రద్దు చేయించాలి. ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే తక్షణమే లింక్ కెనాల్‌ను రద్దు చేస్తూ అధికారిక ప్రకటన చేయాలి" అని డిమాండ్ చేశారు.ఈ ప్రాజెక్టు వల్ల స్థానిక ప్రాంతానికి వచ్చే లాభం సున్నా, జరిగే నష్టం అనంతమని, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా రైతాంగ ఆకాంక్షల కోసం ప్రజాప్రతినిధులు పనిచేయాలని విశ్వ కోరారు.

# నవభారత నిర్మాత నెహ్రూ సేవలు చిరస్మరణీయం'

**62వ వర్ధంతి సందర్భంగా హనుమకొండలో ఘన నివాళి:**

**ఐఐటీలు, భారీ ప్రాజెక్టులకు పునాది వేసిన ఆధునిక భారత శిల్పి'**

**జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాం రెడ్డి.**



హనుమకొండ ప్రతినిధి మే 27 (వార్త నిర్భయం)

భారతదేశ తొలి ప్రధాని, నవభారత నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 62వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా కమిటీ సభ్యులు, గ్రంథాలయ ఛైర్మన్, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్లతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో సర్వస్వం కోల్పోయిన భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా మార్చిన ఘనత నెహ్రూదేనని కొనియాడారు. "సున్నా నుంచి మొదలైన దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలబెట్టిన ఆధునిక భారత శిల్పి నెహ్రూ. నాగార్జున సాగర్ లాంటి భారీ ప్రాజెక్టులు, దీఎజూ, నాూా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఉక్కు కర్మాగారాలను స్థాపించారు" అని గుర్తు చేశారు.నేడు భారతదేశం ఐటీ, స్పేస్ రంగంలో దూసుకుపోతుందంటే దానికి పునాది నెహ్రూనేనని, ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, ఇస్రో వంటి అత్యున్నత సంస్థలను స్థాపించి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చారని అన్నారు.స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందా అని ప్రపంచ దేశాలు హేళన చేసినా, బలమైన పార్లమెంటరీ వ్యవస్థకు పునాది వేసి భారత్‌ను అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిపారని చెప్పారు. యుద్ధ వాతావరణంలో అలీన విధానం తీసుకొచ్చి, ప్రపంచ శాంతి కోసం పంచశీల సూత్రాలను ప్రతిపాదించారని తెలిపారు.పిల్లల కోసమే జీవితాన్ని అంకితం చేసినందుకే పిల్లలంతా ప్రేమగా 'చాచా నెహ్రూ' అని పిలుచుకున్నారు. నెహ్రూ కేవలం కాంగ్రెస్ నాయకుడు కాదు, దేశ ప్రతిష్టను హిమాలయాలంత ఎత్తుకు తీసుకెళ్లిన మహోన్నత వ్యక్తి" అని అన్నారు.కొందరు చరిత్రను విస్మరించి నెహ్రూపై బురదజల్లాలని చూస్తున్నారని, కానీ ప్రజల గుండెల్లో నుంచి నెహ్రూ పేరును ఎవరూ చెరిపివేయలేరని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు

# 'పెట్రోల్, డీజిల్ ధరలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల రాజకీయ డ్రామా'

**రైతు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే నాటకాలు.**

**వడ్లు అమ్ముకోలేక రైతులు ఆవేదనలో ఉన్నారు'**

**'రైతు గుండె చప్పుడు వినేది బీఆర్ఎస్ మాత్రమే.**

**బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్.**



వనపర్తి బ్యూరో మే 27 (వార్త నిర్భయం)

పెట్రోల్, డీజిల్ ధరలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల మాటలు ప్రజలను మభ్యపెట్టే రాజకీయ డ్రామా తప్ప మరొకటి కాదని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ విమర్శించారు.ఒకవైపు రైతులు వడ్లు అమ్ముకోలేక ఆవేదనలో ఉన్నారు. మక్కజొన్న కొనుగోళ్లు నిలిచిపోయి రైతు కుటుంబాలు కన్నీళ్లు పెడుతున్నాయి. అకాల వర్షాలతో తడిసిన ధాన్యానికి కనీస మద్దతు ధర కూడా లేక రైతులు రోడ్డెక్కుతున్నారు. ఈ అసలు సమస్యలపై సమాధానం చెప్పలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల దృష్టి మళ్లించేందుకే కొత్త నాటకాలకు తెరలేపింది" అని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో రైతే కేంద్రబిందువుగా పాలన సాగిందని వాకిటి శ్రీధర్ గుర్తు చేశారు. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మార్కెట్ యార్డుల అభివృద్ధి, పంట కొనుగోళ్లలో రైతుకు అండగా నిలిచింది బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు."రైతు కష్టాలను పక్కనపెట్టి రాజకీయ స్టంట్లు చేయడం కాంగ్రెస్‌కు అలవాటు. రైతు కన్నీళ్లు తుడిచి అండగా నిలవడం బీఆర్ఎస్ సంస్కారం. రైతు గుండె చప్పుడు వినేది, రైతు పక్షాన పోరాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే" అని ఆయన అన్నారు.

# కంటోన్మెంట్ మిలిటరీ సబ్ ఏరియా కార్మికులకు జీతాలు బకాయి'

**కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై ఏఐటీయూసీ ఆగ్రహం, బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా**

**ఏప్రిల్ నెల జీతం ఇప్పటికీ అందలేదు.**

**7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలి': సీఈఓకు వినతి.**

**ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా**



హైదరాబాద్ మే 27 (వార్త నిర్ణయం)

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని మిలిటరీ సబ్ ఏరియాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఏప్రిల్ నెల జీతాలు ఇప్పటివరకు అందకపోవడంపై ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా తీవ్రంగా విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కంటోన్మెంట్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో బుధవారం బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సీఈఓకు వినతిపత్రం అందజేశారు.కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం ప్రతి నెలా 7వ తేదీలోపు జీతాలు చెల్లించాల్సి ఉన్నా, 'సింగ్ సొల్యూషన్' సంస్థ ప్రతినెలా ఆలస్యంగా చెల్లిస్తోందని, ఏప్రిల్ నెల జీతం నేటికీ ఇవ్వకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని నర్సింహా ఆరోపించారు.సంస్థ పేరు మార్చేందుకు బోర్డుకు అనుమతి కోరామని, అందుకే జీతాలు వేయలేదని కాంట్రాక్టర్ చెప్పడం అన్యాయమని, వ్యక్తిగత పనుల కోసం కార్మికుల జీతాలు ఆపడం చట్ట వ్యతిరేకమని స్పష్టం చేశారు.తక్షణం కంటోన్మెంట్ అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని ప్రతినెలా 7వ తేదీలోపు జీతం వేసేలా ఆదేశాలు ఇవ్వాలని, లేని పక్షంలో లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.జీతాలతో పాటు పీఎఫ్ కూడా సక్రమంగా చెల్లించడం లేదని, ముఖ్య యజమానిగా బోర్డు సీఈఓ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్మిక హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు బోర్డు కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ ఏరియాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతికే ప్రభుత్వ ప్రత్యేక చర్యలు.

**సవాయిగూడెంలో రూ.4 కోట్లతో సోలార్ ప్లాంట్.**

**పనులు పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.**

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం.**



వనపర్తి బ్యూరో మే 27 (వార్త నిర్భయం)

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామంలో రూ.4 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్ పనులను బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వనపర్తి జిల్లాలో మొదటగా సవాయిగూడెం, ఆత్మకూరు మండలాలకు ఈ సోలార్ ప్లాంట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సులకు ఓనర్లుగా, అమ్మ ఆదర్శ పాఠశాలలకు చైర్‌పర్సన్‌లుగా, డీజిల్ బంకులకు ఓనర్లుగా, పాఠశాల విద్యార్థులకు బట్టలు కుట్టేవారిగా, వంటలు చేసేవారిగా, క్యాంటీన్ నిర్వాహకులుగా అవకాశాలు కల్పించిందన్నారు. మహిళల పేరుపై రైసుమిల్లులు, గోదాంల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలతో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలే కాకుండా కొత్త హామీలను కూడా అమలు చేశామని, మిగతా హామీలను కూడా వెంటనే నెరవేరుస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పదేళ్లు పాలనలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ సొంత బిడ్డను ఇంటిలో నుంచి తరిమేసే పరిస్థితి ఉందని, అలాంటివారు రాష్ట్రంలోని మహిళల అభివృద్ధిని ఎలా కోరుకుంటారని ప్రశ్నించారు.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎన్నో చేస్తోందని, రానున్న కాలంలోనూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, డీఆర్డీవో ఉమాదేవి, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మైనార్టీ నేత రహీం, గ్రామాల సర్పంచులు, మహిళా సంఘం సభ్యురాళ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు చోట్ల ఓట్లను తొలగించండి అడిషనల్ కలెక్టర్ కు ఫిర్యాదు



జడ్చర్ల మే 27 వార్త నిర్భయం

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీలకు సంబంధించిన డబుల్ ఓట్లు దుర్వినియోగం ఇతర గ్రామాల ఓట్లు జడ్చర్ల మున్సిపాలిటీ జాబితాలో చేర్చాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జడ్చర్ల మండల కార్యాలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ హరి ప్రియ కు జడ్చర్ల అఖిలపక్ష నాయకులు అందజేశారు, గ్రామపంచాయతీ మరియు మున్సిపల్ పరిధిలోని కొందరు వ్యక్తులు రెండు చోట్ల ఓట్లు నమోదు చేసి ఓటు హక్కు దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నారు.ఎన్నికల నియమావళి ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు, దీనిపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు సయ్యద్ మిన్ హాజ్ , మాజీ మూడ డైరెక్టర్ శ్రీకాంత్, బిజేపి పార్టీ పట్టణ అధ్యక్షుడు అమర్ నాథ్ గౌడ్,సిపిఐ,సిపిఎం,టి, సతీష్, ఎంఐఎం నాయకుడు మహ్మద్ జాకీర్ అలీ తదితరులు పాల్గొన్నారు

## ఏదుల మండల కేంద్రానికి వనపర్తి జిల్లా ఆర్డిఓ ఎమ్మార్వో ఆర్ఐ సర్వేర్ సంప్రదించడం జరిగింది



ఎదుల మండలం మే 27( వార్త నిర్భయం )

ఈరోజు ఏదుల మండల కేంద్రానికి వనపర్తి జిల్లా ఆర్డీవో మరియు ఏదుల మండల ఎంఆర్ఓ.ఆర్ ఐ సర్వేయర్.రావడం జరిగింది.వీరికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల రిజర్వాయర్లో భూములు కోల్పోయినటువంటి నిర్వాసితులకు ఏదైతే నష్టపరిహారం రాలేదో వారి గురించి నిన్న తుడి మెగా రెడ్డి ఎమ్మెల్యే.దృష్టికి ఏదుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు పందెం.సుఖేందర్ రెడ్డి మరియు మిగతా నాయకులు తీసుకుపోగా అధికారులు ఈ రోజు ఫీల్డ్ వెరిఫికేషన్ కి రావడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏదుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పందెం సుఖేందర్ రెడ్డి , ఏదుల గ్రామ సర్పంచ్ కాటామోని పరశురాం యాదవ్.ఉమ్మడి గోపాల్పేట్ ఎన్ఎస్ యు ఐ మండల అధ్యక్షులు జానకిరామ్ యాదవ్ 11వ వార్డు మెంబర్ దేవర రాముడు యాదవ్. 12వ వార్డు మెంబర్ కొమ్ము మల్లయ్య యాదవ్ జి. శ్రీనివాస్ రెడ్డి. పి వెంకటయ్య , కే. శేషయ్య మరియు జి. హనుమంతు పాల్గొన్నారు.

# భవనంపై నుంచి పడి మహిళ మృతి

### అనుమానాలు వ్యక్తం చేసిన భర్త

### జడ్చర్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు





జడ్చర్ల మే 27 వార్త నిర్భయం

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోచమ్మగడ్డతండాకు చెందిన ముడావత్ శారద (32) జడ్చర్ల పట్టణంలోని కావేరమ్మపేటలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంపై నుంచి పడి మృతి చెందారు. ఈ మృతిపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ జరిపించాలని మృతురాలి భర్త ముడావత్ రవి బుధవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో రవి తెలిపిన వివరాల ప్రకారం, తన భార్య శారద బిల్డర్ దయాకర్ రెడ్డికి చెందిన నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో పనికి వెళ్లేది. ఈ నెల 27న ఉదయం 9 గంటలకు పనికి వెళ్లిన శారద, ఉదయం 10:30 గంటలకు 5వ అంతస్తు నుంచి కిందపడి చనిపోయిందని మేస్త్రి సుబ్బారావు ఫోన్ చేసి చెప్పినట్లు తెలిసింది. ఘటనా స్థలానికి వెళ్లి చూడగా, తలకు బలమైన గాయాలై రక్తం కారుతూ, కుడిచేయి విరిగిపోయి శారద మృతి చెంది ఉందన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా బిల్డింగ్ యజమాని, మేస్త్రి వ్యవహరించిన తీరుపై అనుమానం ఉందని, తన భార్య మృతి వెనుక కుట్ర ఉందని రవి ఆరోపించారు. ఘటనపై విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకుని తన భార్య మృతికి కారణమైన వారిని శిక్షించాలని రవి కోరారు. ఈ మేరకు జడ్చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రేవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎండి సుల్తాన్ అలీ నియామకం.



రేవల్లి మే 27 (వార్త నిర్భయం) :

రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి సుల్తాన్ అలీ నియమితులయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు బి. మహేశ్ కుమార్ గౌడ్ మే 11న జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ మేరకు ప్రకటించారు. రాజకీయ నేపథ్యం : రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన ఎండి సుల్తాన్ అలీ గతంలో రేవల్లి మండల కో-ఆప్షన్ మెంబర్‌గా పనిచేశారు. గత 21 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ధన్యవాదాలు : నియామకం సందర్భంగా సుల్తాన్ అలీ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కె. శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. స్పందన : పార్టీ నాకు అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ. మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేస్తాను. కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటాను" అని ఆయన స్పష్టం చేశారు. సుల్తాన్ అలీ నియామకంపై మండల కాంగ్రెస్ శ్రేణులు గ్రామ కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## ఏదుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పందెం సుఖేందర్ రెడ్డి

### ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంట నీడలా నడిచారు'

### పార్టీ-ప్రజల మధ్య వారధిగా ఉంటారు' క్యాడర్ హర్షం.



ఏదుల మే 27 (వార్త నిర్భయం) ఏదుల మండల కేంద్రంలో పందెం సుఖేందర్ రెడ్డిని మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంట నీడలా నడుస్తూ, పార్టీ ఆదేశాలను తప్పకుండా పాటించిన సుఖేందర్ రెడ్డికి మండల అధ్యక్ష పదవి ఇవ్వడం విధేయతకు, నిబద్ధతకు దక్కిన నిజమైన గౌరవమని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. వనపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితుడిగా ఉంటూనే, కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకునే సుఖేందర్ రెడ్డి మండల పగ్గాలు చేపట్టడంతో పార్టీ-ప్రజల మధ్య వారధిగా ఉంటారని క్యాడర్ నమ్మకం వ్యక్తం చేసింది పార్టీ కష్టకాలంలో సైతం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాటే శిరోధార్యంగా పనిచేసిన సుఖేందర్ రెడ్డి సేవను గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించడం సరైన నిర్ణయమని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆశీస్సులు, సుఖేందర్ రెడ్డి కష్టపడే తత్వం కలిస్తే మండలంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఈ డబుల్ ఇంజన్ నాయకత్వంలో కాంగ్రెస్ జెండా మరింత ఎత్తుకు ఎగురుతుందని నేతలు అభిప్రాయపడ్డారు.

# మహిళ సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

### ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

### మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి





సూర్యాపేట బ్యూరో మే 27 వార్త నిర్భయం

సూర్యాపేట: మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 22, 23వ వార్డుల్లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిళల కళ్లలో ఆనందం చూడాలనే లక్ష్యంతో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టారని పేర్కొన్నారు. సూర్యాపేటలో వేలాది మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని, ప్రతి అర్హురాలికి చీర అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళ ఓ శక్తి మాత్రమే కాదని, కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టే ఆలోచన గల వ్యక్తి అని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు, ఆర్పీలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,కౌన్సిలర్లు ఎల్గురి అలివేలు చంటిబాబు, వల్దాసు లక్ష్మి శ్రీను టీఎంసీ శ్వేత,మెప్మా ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో చిరువ్యాపారుల తొలగింపుపై ఆందోళన

### దౌర్జన్యం గా తొలగించడం బాధాకరం..

### గజ్జెల లింగమూర్తి.






వరంగల్ ప్రతినిధి మే 27( వార్త నిర్భయం)

వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో రోడ్డుకు ఇరుపక్కల చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కొన్ని సంవత్సరాలు నుడి జీవనం సాగిస్తున్న వ్యాపారులను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా తొలగించడం సరికాదన్నారు. కుటుంబ పోషణ కోసం ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా కష్టపడి జీవిస్తున్న చిరువ్యాపారుల బతుకులకు భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు... వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో చిరువ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు గజ్జెల లింగమూర్తితో పాటు సభ్యులు చంద్రకళ, అరుణ, కవిత, సురేష్, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజ్జెల లింగమూర్తి మాట్లాడుతూ, వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో రోడ్డుకు ఇరుపక్కల చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కొన్ని సంవత్సరాలు నుడి జీవనం సాగిస్తున్న వ్యాపారులను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులు దౌర్జన్యంగా తొలగించడం సరికాదన్నారు. కుటుంబ పోషణ కోసం ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా కష్టపడి జీవిస్తున్న చిరువ్యాపారుల బతుకులకు భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న వారిని జేసీబీలతో భయభ్రాంతులకు గురిచేస్తూ తొలగించడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా వ్యాపారాలను తొలగిస్తే వారి జీవనోపాధి ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. తూర్పు నియోజకవర్గంలోని చిరువ్యాపారులకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రత్యేక స్థలాలను గుర్తించి మడిగెల నిర్మాణం వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గౌరవ మంత్రివర్యులు స్పందించి చిరువ్యాపారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి : తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక



సంగారెడ్డి జిల్లా మే 27 (వార్త నిర్భయం ) సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో తెలంగాణ ఉద్యమకారులు సమావేశమై తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అనేక మంది ఉద్యమకారులు ప్రస్తుతం జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ మంద బాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు నేడు అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర కష్టాలు పడుతున్నారని అన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులకు పంపించలేని దుస్థితిలో ఎంతో మంది ఉద్యమకారులు జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రజాపాలనలోనైనా ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు కనీస గౌరవ వేతనం అందించడంతో పాటు హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత విద్యా సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇళ్ల స్థలాలు కేటాయించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా శ్రీనివాస్, వాలందాస్ మల్లేష్ గౌడ్, కుమ్మరి వెంకటేష్, చింతల రాజు, అంజనేయులు, దప్పు జీవన్ కుమార్, రామకృష్ణ గౌడ్, ఎండి గరీబ్, వడ్డెర ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గడ్డపోతారం మున్సిపాలిటీలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్..







సంగారెడ్డి జిల్లాగడ్డ పోతారం మే 27 వార్త నిర్భయం

పటాన్చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పడిన ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం, లక్ష్మీపతిగూడెం, వావిలాల, గడ్డ పోతారం, అల్లి నగర్, కిస్టాయపల్లి, ఖాజీపల్లి, జిఎంఆర్ కాలనీలలో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు స్థానిక మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో కలిసి శంకుస్థాపన చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు.

# డబ్బులు ఎక్కువ...ఇసుక తక్కువ....

### మా నష్టాన్ని ఎవరు పూడ్చుతారు..?

### బత్తా డిమాండ్ చేస్తున్న డ్రైవర్లు... ఇవ్వకుంటే బెదిరింపులు..

### చెల్లించిన డబ్బులకు రావాల్సిన ఇసుక రావడం లేదంటూ బిల్డర్ల ఆందోళన..




సూర్యాపేట బ్యూరో 27 వార్త నిర్భయశీ

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఇండ్ల నిర్మాణాలు చేసుకునేందుకు ఇసుకను ఆన్లైన్లో బుక్ చేస్తే ఆన్ లైన్ లో చూపించిన వెయిట్ రావడం లేదని దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ బిల్డర్ ఫారూఖ్, ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఆన్లైన్లో బుక్ చేసుకునే సమయంలో ఐదు టన్నుల ఇసుకకు 4319 రూపాయలు చెల్లించామని కానీ మాకు మూడున్నర నుంచి నాలుగు టన్నులు మాత్రమే ఇసుక రావడంతో సుమారు టన్నుపైన ఇసుక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము చెల్లించిన డబ్బులకు సరిపడా ఇసుక రాకపోవడంతో ట్రిప్పుకు వెయ్యి రూపాయల చొప్పున తాము 500 ట్రిపుల వరకు ఇప్పటి వరకు బుక్ చేసుకొని దిగుమతి చేసుకన్నామని సుమారు 5 లక్షల రూపాయలు నష్టపోయామని అన్నారం ఆన్లైన్లో చూపించిన ధరను మేము చెల్లిస్తున్నప్పుడు మాకు రావాల్సిన వెయిట్ ఇసుక ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. బుధవారం తమ వద్దకు మూడు ట్రాక్టర్లు రాగా వెయిట్ వేయిస్తే మూడు ట్రాక్టర్లలో కూడా టన్నుకు పైగా ఇసుక తక్కువగా ఉందన్నారు. ఇసుక తక్కువ వస్తుందని నిరూపించేందుకు వే బ్రిడ్జ్ కాంటాలు కూడా వేయించి పరిశీలించామన్నారు. ఇది కాకుండా ఇసుక తీసుకువచ్చిన డ్రైవర్లు 200 రూపాయల బత్తా డిమాండ్ చేస్తున్నారని బత్తా ఇవ్వకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. తాము ఆన్లైన్లో చూపిన డబ్బులు చెల్లిస్తున్నప్పుడు డ్రైవర్లకు బత్తా ఎందుకు ఇవ్వాలని అన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి ఇసుక ఎందుకు తక్కువ వస్తుందో తగిన విచారణ చేసి మాకు న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ విషయమై తాము కోర్టుకు వెళ్లడంతో పాటు కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామన్నారు. వారి వెంట తాఫీ పనివార్ల సంఘం అధ్యక్షులు రెబల్ శ్రీనివాస్, సాజిద్ ఖాన్,ఇతర బిల్డర్లు మేస్త్రీలు ఉన్నారు.

## వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను

### 24 వ వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ యాదవ్






సూర్యాపేట బ్యూరో మే 27 వార్త నిర్భయం

సూర్యాపేట పట్టణంలోని 24 వ వార్డులో ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ మన్నెం అరుణ మల్లేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూవార్డులో తెల్ల రేషన్ కార్డు కలిగినటువంటి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీర అందే విధంగా పంపిణీ చేస్తామని అన్నారు. తమ వార్డులో ఎక్కువగా నిరుపేద మహిళలు ఉన్నారని వారికి ప్రభుత్వ కార్యక్రమాలు వివరించి అరులైన వారిని దరఖాస్తు చేసుకునే విధంగా వారికి సమాచారం అందజేస్తునట్లు చెప్పారు. వార్డులో ఎక్కువగా పెన్షన్ దారులు దూర ప్రాంతానికి వెళ్లి పెన్షన్ తీసుకోవడం ఇబ్బంది పడుతున్నారని, అందువలన తమ ఇంటి పక్కన ఉన్న ఖాళి స్థలంలో చుట్టుపక్కల నాలుగు వార్డుల వారికి పెన్షన్లు లభించే విధంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాను కౌన్సిలర్ గా గెలిచినప్పటి నుండి వార్డు ప్రజలకు అందుబాటులో వుంటూ, వార్డు యొక్క పారిశుద్య పనులు , మంచినీటి సరఫరా జరిగే విదంగా ఎప్పటికప్పుడు మున్సిపాలిటీ సిబ్బందితో మాట్లాడి తగిన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డుకు చెందిన నాయకులు పిల్లల ఉపేందర్, బెంజారపు కరుణాకర్, ఎడ్లమల్ల సన్నీ, ఎండి ఖలీల్, పరసబోయిన నాగయ్య, అంజయ్య, శివ, పోతనబోయిన శ్రవణ్, అల్లి మురళి, డీజే నరేందర్ తదితరులు పాల్గొన్నారు